నిరుడు కాళేశ్వర జలాలతో నిండుగా మిడ్ మానేరు (ఫైల్)

ప్రస్తుతం అడుగంటిన మిడ్‌మానేరు జలాశయం (శ్రీ రాజరాజేశ్వర జలాశయం)

నిన్న జలభాండం.. నేడు ఎడారి!

నిరుడు కళ కళ... ఇప్పుడు వెలవెల

అడుగంటిన మధ్యమానేరు జలాశయం

2019-2023 వరకు వాటర్‌హబ్

కాళేశ్వరం జలాలతో నిండుగా ప్రాజెక్టు

కాంగ్రెస్ పాలనలో పరిస్థితి రివర్స్

మధ్యమానేరు కాలువ గేట్లు తెరిచినా

అన్నపూర్ణకు చుక్కనీరు పారని దుస్థితి

ఇదే కొనసాగితే రంగనాయక సాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ ప్రాజెక్టుల పరిస్థితి అగమ్యగోచరం

ఎడారిని తలపిస్తున్న మధ్యమానేరు ప్రాంతం

కరీంనగర్, మార్చి 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కేసీఆర్ పాలనలో ఐదేండ్లపాటు జలభాండంగా విరాజిల్లిన మధ్యమానేరు ప్రాజెక్టు (శ్రీరాజరాజేశ్వర రిజర్వాయర్) ఇప్పుడు వెలవెలబోతున్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడునెలల్లోనే చుక్కనీటికి దినదిన గండంలా మారింది. ఈ ప్రాజెక్టు నుంచి కొండపోచమ్మ వరకు జలాలను ఎత్తిపోసిన ఘనతను బీఆర్ఎస్ ప్రభుత్వం లిఖించుకుంటే, పక్కనే ఉన్న అన్నపూర్ణ ప్రాజెక్టుకు కూడా నీరు ఇవ్వలేని అసమర్థ ప్రభుత్వం అనే చెడ్డ పేరును కాంగ్రెస్ తెచ్చుకుంటున్నది. నాడు ఎఫ్ఆర్ఎల్ ప్రకారం చివరి భూమి వరకు ప్రాజెక్టులో నీరు ఉండగా.. నేడు అవే భూములు ఎడారిని తలపిస్తున్నాయి. కేసీఆర్ ప్రభుత్వం కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా మధ్యమానేరు ప్రాజెక్టును వాటర్ హబ్‌గా మార్చింది. కాళేశ్వరం నుంచి గాయత్రి పంపుహౌస్ ద్వారా మధ్యమానేరుకు నీటిని ఎత్తిపోసింది. అక్కడినుంచి ఇటు దిగువమానేరు జలాశయం, అటు అన్నపూర్ణ రిజర్వాయర్ మీదుగా కొండపోచమ్మసాగర్, ఎగువమానేరు వరకు నీటిని ఎత్తిపోసింది. మధ్యమానేరుకు కాళేశ్వరం ఎత్తిపోతలు 2019లో ప్రారంభం కాగా, అప్పటినుంచి 2023 డిసెంబర్ వరకు ఈ ప్రాజెక్టు 365 రోజులూ నిండుకుండలా ఉండేది. మధ్యమానేరు ప్రాజెక్టు మొత్తం సామర్థ్యం 27.50 టీఎంసీలు కాగా, నిరుడు మార్చిలో 23 టీఎంసీల నీటి నిల్వలున్నాయి. నీటి నిల్వలు ఎంత తగ్గితే అంత నీటిని కాళేశ్వరం నుంచి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎత్తిపోసింది. గత మార్చిలో ఒకవైపు కొండపోచమ్మసాగర్‌కు నీటిని ఎత్తిపోస్తూనే, ఎల్ఎండీ (దిగువ మానేరు జలాశయం) పరిధిలోని పంటలకు ప్రతిరోజూ నాలుగు నుంచి ఐదు వేల క్యూసెక్కుల నీటిని నిరంతరాయంగా విడుదల చేసింది. కానీ, ప్రస్తుతం మూడు నెలల కాంగ్రెస్ పాలనలో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. కాళేశ్వరం నుంచి ఎత్తిపోతలు ప్రారంభమైన తర్వాత ఏనాడూ లేని దుస్థితి నేడు మధ్యమానేరు ప్రాజెక్టులో కనిపిస్తున్నది. ప్రస్తుతం ఇక్కడ తొమ్మిది టీఎంసీల నీరు మాత్రమే ఉన్నది.

గేట్లు తెరిచినా చుక్కనీరు వెళ్లడం లేదు

మధ్యమానేరు ప్రాజెక్టు నుంచి ముందుగా అన్నపూర్ణ రిజర్వాయర్, అక్కడినుంచి రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ వరకు నీటిని కేసీఆర్ ప్రభుత్వం ఎత్తిపోసింది. మధ్యమానేరు నుంచి మొదటిసారిగా 2020 మే 11న అన్నపూర్ణకు నీటిని ఎత్తిపోశారు. అప్పటినుంచి అవసరాలకు అనుగుణంగా ఎత్తిపోతలు కొనసాగుతూ వచ్చాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా అనంతగిరి వద్ద నిర్మించిన ఈ రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 3.5 టీఎంసీలు. అన్నపూర్ణ రిజర్వాయర్‌కు మధ్యమానేరు జలాశయానికి మధ్య దూరం 11.186 కిలోమీటర్లు. మధ్యమానేరు నుంచి అన్నపూర్ణకు నీటిని పంపించడానికి ఓగులాపూర్ గ్రామపరిధిలో కాలువలు, దానిపై క్రస్ట్‌గేట్లు ఏర్పాటుచేశారు. ఇవి ఓపెన్ చేస్తే అన్నపూర్ణ రిజర్వాయర్ పరిధిలో ఏర్పాటుచేసిన సర్జ్‌పూల్‌కు గ్రావిటీ, సొరంగ మార్గం ద్వారా నీరు వెళ్లేది. ఆ మేరకు ఎప్పటికప్పుడు సర్జ్‌పూల్ నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి ఎత్తిపోసేవారు. ఇప్పుడు మొత్తం క్రస్ట్‌గేట్లు ఎత్తినా చుక్కనీరు కూడా అన్నపూర్ణకు వెళ్లడంలేదు. అలా వెళ్లాలంటే మధ్యమానేరులో పది టీఎంసీలపైన నీటి నిల్వలు ఉండాలి. ప్రస్తుతం తొమ్మిది టీఎంసీలే ఉండటంతో పైకి నీరు ఇవ్వలేని దుస్థితి ఏర్పడింది. దీంతో అన్నపూర్ణ, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొంచపోచమ్మసాగర్, ఎగువమానేరు ప్రాజెక్టులు, వాటి కాలువలను నమ్ముకొని పంటలు వేసిన రైతులు సాగునీరు రాక ఇబ్బంది పడుతున్నారు. ఇదే కొనసాగితే ఎగువన ఉన్న ప్రాజెక్టుల పరిస్థితి కూడా అగమ్యగోచరంగా మారుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

నాడు నీటి నిల్వలు, నేడు వరిపొలాలు

ప్రస్తుతం మధ్యమానేరు వెనుక భాగమంతా ఎడారిని తలపిస్తున్నది. కేసీఆర్ హయాంలో నిండుకుండలా ఉన్న ఈ ప్రాజెక్టు ప్రస్తుతం అడుగంటింది. ఇటు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి గానీ, అటు కాళేశ్వరం నుంచి గానీ నీళ్లను మధ్యమానేరుకు ఇచ్చే సమర్థత కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని భావించిన రైతులు ప్రాజెక్టు చివరి భూముల్లో వరితో పాటు వివిధ రకాల పంటల సాగు చేస్తున్నారు. చీర్లవంచ, అగ్రహారం, చింతల్‌ఠాణా, రుద్రారంతోపాటు మరికొన్ని గ్రామాల రైతులు, మధ్యమానేరు భూముల్లో సాగు చేసుకుంటున్నారు. ఏ పరిస్థితుల్లోనూ కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లు నింపదు కాబట్టి.. తమ పంటలు ప్రాజెక్టులో మునిగిపోయే ప్రసక్తే లేదన్న ధీమా వారిలో కనిపిస్తున్నది. ఇదిలాఉండగా, ప్రాజెక్టు చివరి భూముల్లోని బావుల్లోనూ నీళ్లు అడుగంటిపోతున్నాయి. మహా అయితే ఈ పంటకు నీళ్లు సరిపోతాయని రైతులు భావిస్తున్నారు. కేసీఆర్ హయాంలో వాటర్‌హబ్‌గా, జంక్షన్‌గా ఉన్న మధ్యమానేరులో జలాలు అడుగంటిపోవడం వల్ల దానికి అనుసంధానంగా ఉన్న ఎన్నో ప్రాజెక్టులపై ఆ ప్రభావం పడుతున్నది. ప్రభుత్వం ఇప్పటికైనా కాళేశ్వరం ఎత్తిపోతలు చేపడితే, లక్షలాది కుటుంబాలకు జలాలు అందుతాయని ఈ ప్రాంత రైతులు భావిస్తున్నారు.

మధ్యమానేరు నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్ కోసం మధ్యమానేరులో నిర్మించిన కాలువలో అడగంటిన నీళ్లు

హైదరాబాద్‌కు 'జల'దరింపు!

- **ప్రణాళిక లోపించడంతో పొంచి ఉన్న మంచినీటి ముప్పు**
- **కృష్ణా బోర్డు కరుణిస్తేనే నగరానికి కృష్ణాజలాల సరఫరా**
- **కోటా పూర్తవడంతో కేఆర్ఎంబీ నిర్ణయంపై ఉత్కంఠ**
- **కాళేశ్వర జలాలు లిఫ్టు చేయక ఎండుతున్న ఎల్లంపల్లి**
- **అత్యవసర మోటర్లు అమర్చినా ఎదురుకానున్న సవాళ్లు**

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, మార్చి 23 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ ప్రణాళికా లోపం హైదరాబాదీలకు నీటి కష్టాలను తెచ్చిపెడుతున్నది. కృష్ణాజలాల వినియోగంలో ముందస్తు వ్యూహం లేకపోవడం, అవకాశమున్నా కాళేశ్వర జలాలను ఎత్తిపోయకుండా మొండికేయడం వల్ల మహానగరానికి మంచినీటి గండం పొంచి ఉన్నది. నీటిమట్టాలు పడిపోయినా అత్యవసర మోటార్ల ద్వారా ఎత్తిపోస్తామని జలమండలి అధికారులు చెప్తున్నా.. అనేక సవాళ్లు మోకాలడ్డేందుకు సిద్ధంగా ఉన్నాయి. కృష్ణాజలాల వినియోగంలో తెలంగాణ నీటి కోటా పూర్తవడంతో కృష్ణానదీ యాజమాన్య బోర్డు కరుణిస్తే తప్ప నాగార్జునసాగర్ నుంచి నగరానికి కృష్ణా జలాల సరఫరా సాధ్యమే కొనసాగే అవకాశాలు లేవు. మరోవైపు కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నప్పటికీ రేవంత్ సర్కారు మొండికేయడంతో ఎల్లంపల్లిలో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి.

నీటికోటా లేకుండా ఎత్తిపోత ఎలా?

ఈ నీటి సంవత్సరంలో కృష్ణా బేసిన్ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొన్నందున అప్రమత్తంగా వ్యవహరించాల్సిన రాష్ట్ర సర్కారు చేతులు కాలాక... అన్నట్టుగా వ్యవహరిస్తున్నది. కృష్ణా జలాల వినియోగంపై గత ఏడాది అక్టోబర్‌లోనే జరిగిన కృష్ణాబోర్డు త్రిసభ్య కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. వాస్తవానికి నాగార్జునసాగర్‌లో 510 అడుగుల కంటే నీటిమట్టం పడిపోతే హైదరాబాద్ తాగునీటి సరఫరాకు ఇబ్బంది ఏర్పడుతుంది. అయినా నీటి లభ్యత తక్కువగా ఉండటంతో 505 అడుగుల వరకు ఉన్న నీటిని లెక్కించి తెలంగాణకు 39.743 టీఎంసీల కోటాను కృష్ణా బోర్డు కేటాయించింది. నగరానికి జలమండలి అందిస్తున్న మంచినీటి సరఫరాలో ఏకంగా 48 శాతం వరకు ఉన్న కృష్ణాజలాలను దృష్టిలో ఉంచుకొని అటు శ్రీశైలం, ఇటు సాగర్‌లో నీటి వినియోగాన్ని నిర్వహించుకోవాల్సిన ప్రభుత్వం అవేవీ పట్టించుకోకపోవడంతో కోటా వాడకం పూర్తవడంతోపాటు అదనంగా 4.743 టీఎంసీలు అదనంగా వాడుకున్నారని కేఆర్‌బీఎం తేల్చింది. రానున్న 4 నెలల వరకు హైదరాబాద్ నీటి సరఫరా కోసం ఆరు టీఎంసీలు కావాలని జలమండలి చెప్తున్నది. నీటిమట్టం పడిపోతే అత్యవసర మోటార్లు కూడా ఏర్పాటు చేస్తామని రంగం సిద్ధం చేసుకున్నది. కానీ, అసలు నీటి కోటా లేకుండా జలాల ఎత్తిపోత ఎలా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. మానవతా దృక్పథంతో స్పందించి కృష్ణానదీ యాజమాన్య బోర్డు అనుమతులు ఇస్తుందని అధికార యంత్రాంగం ఆశిస్తున్నది. అంటే కేఆర్ఎంబీ దయాదాక్షిణ్యాలపై హైదరాబాద్ తాగునీటి సరఫరా వ్యవస్థ ఆధారపడి ఉన్నదనేది స్పష్టమవుతున్నది. ప్రాజెక్టుల నిర్వహణను బోర్డుకు అప్పగించి చేతులెత్తేసిన రాష్ట్ర ప్రభుత్వం.. ఇటు ప్రణాళికాబద్ధంగా నీటిని వాడుకోకపోవడంతో పరిస్థితి నివురుగప్పిన నిప్పులా తయారైంది.

లెక్క కుదరని ఎల్లంపల్లి...

హైదరాబాద్‌లో సరఫరా అవుతున్న మంచినీటిలో 30 శాతం (రోజుకు 172 మిలియన గ్యాలన్లు) గోదావరి జలాలే. ఎల్లంపల్లి జలాశయం నుంచి నగరానికి ఈ నీటిని సరఫరా చేస్తారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం ఎత్తిపోతల పథకంతో మండు వేసవిలోనూ ఎల్లంపల్లిలో నీటి నిల్వలు పుష్కలంగా ఉండేవి. కానీ, మేడిగడ్డ లోపాన్ని సాకుగా చూపి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇన్‌ఫ్లో వస్తున్నా ప్రాణహిత జలాలను ఎత్తిపోయడం లేదు. ఇప్పటికీ అక్కడ రెండు మోటార్లు నడిపేంత ఇన్‌ఫ్లో ఉన్నట్టుగా తెలుస్తున్నది. అయినా ప్రభుత్వం స్పందించకపోవడంతో ఎల్లంపల్లి జలాశయం అడుగంటిపోతున్నది. ప్రస్తుతం అందులో 8.83 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది డెడ్‌స్టోరేజీ కింద 3.3 టీఎంసీలు పోగా లభ్యత 5.5 టీఎంసీలుగా ఉన్నది. వచ్చే నాలుగు నెలల హైదరాబాద్ తాగునీటి అవసరాలకు 3.60 టీఎంసీలు కావాలని జలమండలి అంచనా.

పంటలకు ఎల్లంపల్లి నీళ్లు!

గడ్డు పరిస్థితి ఉంటే.. పులి మీద పుట్రలా! సాగునీటి విడుదలకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు ఇచ్చారనే సమాచారం మరింత ఆందోళన కలిగించే పరిణామం. వేములవాడ, ధర్మపురి ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్ సీఎంని కలిసి తమ నియోజకవర్గాల్లో పంటలను కాపాడేందుకు ఎల్లంపల్లి నుంచి నీటిని విడుదల చేయాలని కోరగా... ఆయన మంత్రి ఉత్తమ్‌కు ఆదేశాలిస్తే... మంత్రి చీఫ్ ఇంజినీర్‌కు ఆదేశాలిచ్చినట్లుగా విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నియోజకవర్గంలో ప్రకటన విడుదల చేశారు. మరి ఇదే నిజమైతే పరిస్థితి మరింత గందరగోళంగా మారనుందో అర్థం చేసుకోవచ్చు.

పాత రాతియుగం నాటి రాతిగొడ్డలి గుర్తింపు

హైదరాబాద్, మార్చి 23 (నమస్తే తెలంగాణ) : మహారాష్ట్ర పరిసర ప్రాంతాలలో మరోసారి పాతరాతి యుగం నాటి రాతి గొడ్డలిని పురావస్తు పరిశోధకులు శనివారం గుర్తించారు. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా, సిరోంచ తాలుకాకు 19 కిలోమీటర్ల దూరంలో నిజామాబాద్, ఛత్తీస్‌గఢ్, జగదల్‌పూర్‌ను కలిపే జాతీయ రహదారి 63పై ఉన్న 'వడధామ్ శిలాజాల తోట' పక్కన ఉన్న ఒక చిన్న సెలయేటి ఒడ్డున కొత్త తెలంగాణ చరిత్ర బృందం చేసిన పరిశోధనల్లో పాత రాతి యుగం నాటి గొడ్డలిని గుర్తించారు. ఈ చేతి గొడ్డలి లక్ష సంవత్సరాల కిందటి రాతి పరకరమని పరిశోధన బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ అభిప్రాయపడ్డారు. ఇలాంటివి ప్రాణహిత నది పరివాహక ప్రాంతాలలో సమృద్ధిగా కనిపిస్తాయని చెప్పారు. డైనోసార్ల అవశేషాలు, బండబారిన చెట్ల శిలాజాలున్న ప్రాంతంలో ఈ రాతిగొడ్డలి లభించడం విశేషమన్నారు.

సాగర్‌ను రెండోరోజూ సందర్శించిన కేఆర్ఎంబీ సభ్యులు

నందికొండ, మార్చి 23 : కృష్ణారివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ) సభ్యుడు డాక్టర్ ఆర్ఎస్ సాంఖున ఆధ్వర్యంలో ఈఈ శివశంకరయ్య, రఘునాథ్‌రావుతో కూడిన బృందం రెండో రోజైన శనివారం నాగార్జున సాగర్ ఎడమ కాల్వ హెడ్ రెగ్యులేటర్‌ను సందర్శించింది. గతంలో తెలంగాణ ఎన్ఎస్‌పీ అధికారులు డ్యామ్ నిర్వహణ పనులు చేపట్టేవారు. ఇప్పుడు డ్యామ్‌పైన ఆ పరిస్థితి లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో తెలంగాణ ఇరిగేషన్ అధికారులు ప్రాజెక్టుకు చేపట్టాల్సిన మరమ్మతు పనులు పూర్తి చేసే విషయాన్ని కేఆర్ఎంబీ దృష్టికి తీసుకెళ్లారు. దాంతో డ్యామ్ నిర్వహణ పనులను తెలంగాణ అధికారులకు అప్పగించడానికి, డ్యామ్‌పైన ఏయే పనులు ఎక్కడెక్కడ చేపట్టాల్సి ఉన్నది అనే అంశాలను కేఆర్ఎంబీ బృందం పరిశీలించింది. అనంతరం ఎన్ఎస్‌పీ అధికారులతో సమీక్ష నిర్వహించారు.

రైతన్నలకు లీగల్ నోటీసులు

మొదటిపేజీ తరువాయి...

రుణమాఫీ సంగతి దేవుడెరుగు.. తీసుకున్న రుణం చెల్లించాలని బ్యాంకుల నుంచి రైతులకు లీగల్ నోటీసులు వస్తున్నాయి. నోటీసులు అందుకున్న రైతులు కాంగ్రెసోళ్ల మాటలన్నీ నీటి మూటలయ్యాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాఫీ చేస్తమన్న సర్కారు మౌనంగా ఉండడంపై గిదేం పోయేకాలం అంటూ శాపనార్థాలు పెడుతున్నారు.

రుణమాఫీపై వివరాలే అడగలేదట..

కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు రుణాలు తీసుకున్న రైతుల వివరాలు కూడా తీసుకోలేదని సంబంధిత శాఖ అధికారులే చెప్పడం గమనార్హం. రుణమాఫీ చేసే ఉద్దేశముంటే కనీసం వివరాలు తీసుకోవాలి కదా.. మమ్ములనైతే అడగలేదని పేరు చెప్పేందుకు ఇష్టపడని ఓ జిల్లా స్థాయి అధికారి 'నమస్తే తెలంగాణ'తో బాహాటంగానే అన్నారు. ఆయన మాటలను బట్టి చూస్తే అసలు రూ.2 లక్షల రుణమాఫీకి కసరత్తు జరిగిందా.. లేదా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. పైపెచ్చు లీగల్ నోటీసులు ఇవ్వడంపై ఆయన స్పందిస్తూ.. 'తీసుకున్న రుణాలు తిరిగి కట్టకపోతే లీగల్ నోటీసులు ఇవ్వకపోతే ఏం చేస్తాం. బ్యాంక్ మేనేజర్‌లపై ఉన్నతాధికారుల ఒత్తిడి ఉంటుంది కదా. అందుకని నోటీసులు ఇవ్వక తప్పదు' అని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఇలాంటి నోటీసులు ఏమైనా ఇచ్చారా అంటే.. అప్పుడు బ్యాంకర్లకు ముందస్తు ఆదేశాలు ఉండడంతో అందరూ రైతులకు సహకరించే వారిని... కానీ ఇప్పుడు కమ్యూనికేషన్ గ్యాప్‌తో ఇబ్బందులు తలెత్తుతున్నాయని సదరు అధికారి వివరించారు.

> ఈ రైతు పేరు పగడపల్లి నాగభూషణ్. నిర్మల్ జిల్లా లక్ష్మణ చాందకు చెందిన ఈ రైతుకు లాయర్ నుంచి బ్యాంక్ మేనేజర్ లీగల్ నోటీసు పంపారు. మార్చి 3, 2024 నాటికి రూ.2,32,876.56లతో పాటు వడ్డీ కలుపుకొని రూ.2,76,876.56 కట్టాలని నోటీసులో పేర్కొన్నారు. పైగా మార్చి 4, 2024 నుంచి మళ్లీ వడ్డీ కూడా చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. నోటీసులు అందుకున్న 15 రోజుల్లోగా మొత్తం డబ్బులు కట్టాలని, లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అందులో పేర్కొన్నారు. దీంతో ఏం చేయాలో తెలియక రైతు నాగభూషణ్ ఆందోళన చెందుతున్నారు.



ఎక్కడికెళ్లి తేవాలే.. చావాల్నా

నాకు 66 యేండ్లుంటయి. గుంట తక్కువ రెండెకరాలుంది. దాని మీద 2017లో రూ. లక్ష లోన్ తీసుకున్న. 2020లో ఆ లోన్ రూ.1.60 లక్షలకు రెన్యూవల్ అయింది. ఆ తర్వాత ఇద్దరు బిడ్డల పెండ్లిళ్లు చేసిన. వయసు మీద పడ్డది. సాతనైతలేదు. ఎవుసానికి పోని పరిస్థితి. పొలం కౌలుకిస్తున్నా. వాళ్లిచ్చే బియ్యంతోనే తిండికి గడుపుతున్నా. ఈ లోన్ పైసలు యాడికెళ్లి తేవాలే.. ఆత్మహత్య చేసుకోవాల్నా. రేవంత్‌రెడ్డి రూ.2 లక్షలు మాఫీ చేస్తాడని ఎదురు చూస్తున్నం. ఇంతల్నే బ్యాంకోళ్లు నోటీసుల మీద నోటీసులు పంపుతున్నరు. నేనైతే ఏం చేయలేని పరిస్థితి. మా నోట్ల మన్ను కొట్టొద్దు. మమ్ములను ఆగం చేయొద్దని రెండు చేతులెత్తి బ్యాంకు సార్లకు దండం పెడుతున్న.

- నాగభూషణ్, రైతు, లక్ష్మణచందా, పగడపల్లి (మ), నిర్మల్ జిల్లా

రాజధానిలో పలుచోట్ల ఎర్త్ అవర్

హైదరాబాద్, మార్చి 23 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్‌లో పలుచోట్ల ఎర్త్ అవర్ నిర్వహించారు. శనివారం రాత్రి 8.30 నుంచి 9.30 గంటల వరకు లైట్లు ఆపివేశారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీఎస్‌పీసీబీ), సచివాలయం, అసెంబ్లీ, చార్మినార్, అంబేద్కర్ విగ్రహం వద్ద, పలు ఇండ్లల్లో, సంస్థల్లో ఎర్త్ అవర్‌ను పాటించారు. టీఎస్‌పీసీబీ ఆధ్వర్యంలో 'పుడమి కోసం గంట కార్యక్రమం' నిర్వహించారు. భూమిని కాలుష్యం నుంచి పరిరక్షిస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. భూమి రక్షణ, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏటా మార్చి 23న ఎర్త్ అవర్‌ను పాటిస్తున్న విషయం తెలిసిందే.

శుక్రవారం చెన్నూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట తాగునీటి కోసం ధర్నా

ధర్నా చేసిన మహిళలపై కోడ్ ఉల్లంఘన కేసు

చెన్నూర్ రూరల్, మార్చి 23: మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణంలోని పద్మానగర్‌లోగల గుడిసె కాలనీకి చెందిన పలువురు మహిళలపై ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసు నమోదైనట్టు చెన్నూర్ సీఐ రవీందర్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట మహిళలు నీటి కోసం ఖాళీ బిందెలతో ధర్నా చేశారు. ఎఫ్ఎస్‌టీ టీం ఫిర్యాదు మేరకు మద్దెల భదాణి, శిరీష, ప్రసన్న, పద్మ, సుజాత, రుక్మిణి, మౌలిక, ప్రియాంక, రేవతితోపాటు మరికొందరిపై కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్టు సీఐ రవీందర్ తెలిపారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల కమిషన్ ఆదేశాలను పాటించాలని, ఎవరైనా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

ముగిసిన ఎన్విరాన్‌మెంట్ వరల్డ్ వాటర్ డే సదస్సు

హైదరాబాద్, మార్చి 23 (నమస్తే తెలంగాణ) : అన్ని కాలేజీల విద్యార్థులకు అధ్యాపకులు నీటి నిర్వహణ గురించి తెలియజేయాల్సిన అవసరం ఉన్నదని తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సీనియర్ సైంటిస్టు డాక్టర్ డబ్ల్యూజీ ప్రసన్నకుమార్ అన్నారు. శనివారం జేఎన్టీయూలో ఎన్విరాన్‌మెంట్ వరల్డ్ వాటర్ డే సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు వారి వారి పరిసర ప్రాంతాల్లో చదువురాని వారికి నీటి విలువల గురించి చెప్పాలని సూచించారు. హెచ్‌వోడీ డాక్టర్ హిమబిందు ఆధ్వర్యంలో జరిగిన ఈ వర్క్‌షాప్‌కు విద్యార్థులతో పాటు ఆచార్య సుధీర్‌కుమార్, ప్రొఫెసర్లు తదితరులు పాల్గొన్నారు.